# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. యోగా భారతీయ సంస్కృతిలో భాగమని, దీనిని మనమందరం ఆచరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు.**

**2. నెల్లూరు నగరంలోని అర్హులకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**3. తల్లికి వందనం పథకానికి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.**

**4. పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.**

**5. చేపల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన వేట నిషేధం గత అర్ధరాత్రితో ముగియడంతో మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమవుతున్నారు.**

==========================

యోగా భారతీయ సంస్కృతిలో భాగమని, దీనిని మనమందరం ఆచరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఈ ఉదయం ప్రకాశం జిల్లా పాకల తీర ప్రాంతంలో వెయ్యి మందితో యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ ఆర్.దామోదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీచ్ వాచ్ టవర్‌ను ప్రారంభించిన మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. వన్ ఇయర్...వన్ హెల్త్ పేరుతో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్రంలోని లక్ష ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి వివరిస్తూ..

..వాయిస్ 32సెకన్లు

--------------------------

తిరుపతిజిల్లా శ్రీకాళహస్తికి చెందిన దీక్షితకు అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరగనున్న యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి యోగా

చేసే అవకాశం ఆమెకు లభించింది. యోగా విన్యాసాల్లో ప్రతిభ కనబరుస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా నుంచి దీక్షితను ఎంపిక చేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో యోగా నేర్చుకున్నానని దీక్షిత ఆనందం వ్యక్తం చేస్తూ..

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి 'విలువల విద్య' పుస్తకాలను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి.. ఎస్సీఈఆర్టీ ఈ పాఠ్యపుస్తకాలను రూపొందించింది. ఆరవ తరగతికి 'తోరణాలు', ఏడవ తరగతికి 'మనోవికాసం' ఎనిమిది, తొమ్మిది తరగతులకు 'సూక్తి సుధ', పదో తరగతికి 'అమృతధార' పేరుతో ఈ పుస్తకాలను రూపొందించారు.

---------------------------

పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. కౌన్సెలింగ్‌కు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 20 నుంచి 27వ తేదీవరకు గడువు ఉంది. 21 నుంచి 28వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. కోర్సులు, కళాశాలల ఎంపికకు ఐచ్ఛికాల నమోదుకు 25 నుంచి 30 వరకు అవకాశం కల్పించింది. జులై 1వ తేదీన ఐచ్ఛికాల మార్పు, సీట్ల కేటాయింపు 3వ తేదీన చేయనున్నామని సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది. సీట్లు పొందిన అభ్యర్థులు జులై 4 నుంచి 8వ తేదీలోపు కళాశాలల్లో చేరాలని సూచించింది.

---------------------------

నెల్లూరు నగరంలోని అర్హులకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరపురంలో ఏపీజే అబ్దుల్ కలాం పార్కును ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భగత్ సింగ్ కాలనీలోని 14 వందల మంది పేదలకు.. త్వరలోనే ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేస్తామన్నారు. పేదలు నివసించే ప్రాంతాలలో పార్కులను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు.

---------------------------

తల్లికి వందనం పథకానికి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. అర్హులకు సంబంధించిన నగదును వారి తల్లుల ఖాతాల్లో జమ చేశామని నిన్న ఒక ప్రకటనలో వెల్లడించింది. అనర్హత పొందిన లబ్ధిదారులు తమ వివరాలతో గ్రామ సచివాలయ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఫిర్యాదులను పరిశీలించి, వారు వాస్తవంగా అర్హత కలిగి ఉంటే ఆర్థిక సహాయాన్ని అందిస్తామని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది.

---------------------------

నీట్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల్లో 100 లోపు ర్యాంకులు సాధించిన రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దేశస్థాయిలో నిర్వహించిన పోటీపరీక్షలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందని లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభతో జాతీయస్థాయిలో

అత్యుత్తమ ర్యాంకులు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని.. వైద్య వృత్తి ద్వారా భవిష్యత్‌లో ప్రజలకు సేవలందించాలని మంత్రి ఆకాంక్షించారు.

---------------------------

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 3 లక్షల 62 వేల 917 రూపాయల విలువైన ఆరు చెక్కులను ఈ రోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలు నిర్వహిస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పరిపాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమం పథకాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడమే లక్ష్యంగా అన్ని మండల కేంద్రాల్లో సభలు నిర్వహించాలని నిర్ణయించామని ఆమె నిన్న ఒక ప్రకటనలో వెల్లడించారు. బీజేపీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు ఈ సభలకు ముఖ్య వక్తలుగా హాజరవుతారని, దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని పార్టీ నాయకులకు పురందేశ్వరి సూచించారు.

---------------------------

ప్రముఖ తెలుగు విప్లవకవి, అభ్యుదయ నవయుగ కవితా ప్రయోక్త శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు వర్ధంతి ఈరోజు. 1910 ఏప్రిల్ 30వ తేదీన విశాఖపట్నంలో జన్మించిన శ్రీశ్రీ... అభ్యుదయ భావాలతో తెలుగు సాహిత్యంలో అద్భుతమైన కవితా సంకలనాలతో పాటు.. చలన చిత్ర గీతాలను, రేడియో నాటికలను రచించారు. ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో అనర్ఘరత్నం వంటి మహా ప్రస్థానాన్ని శ్రీశ్రీ రచించారు. తెలుగు సాహిత్యపు దశ, దిశను మార్చిన పుస్తకంగా మహా ప్రస్థానం ప్రసిద్ధి గాంచింది. అల్లూరి సీతారామరాజు సినిమా కోసం 1974లో శ్రీశ్రీ రాసిన పాటకు జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక మహాప్రస్థానాన్నే సృష్టించుకొని 20వ శతాబ్దపు ఆధునిక తెలుగుకవితకు చుక్కానిగా నిలిచిన శ్రీశ్రీ 1983 జూన్ 15న తుది శ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్…40 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తీర ప్రాంతాల్లో మత్స్యకారులు నేటి నుంచి చేపల వేటను పునః ప్రారంభించారు. గత రెండు నెలలుగా చేపల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధం గత అర్ధరాత్రితో ముగియడంతో మత్స్యకారులు చేపల వేట ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వారికి శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చేపల వేట సాగించాలని మంత్రి సూచించారు.

=====================